ఏకం సనాతన్ భారత్‌దళ్ పార్టీ బలోపేతానికి కృషి



మీడియా సమావేశంలో పాల్గొన్న ఏకం సనాతన్ భారత్‌దళ్ పార్టీ నాయకులు

కవాడిగూడ: రాష్ట్రంలో ఏకం సనాతన్ భారత్‌దళ్ పార్టీని బలోపేతం చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్‌షా, నరేంద్రకుమార్ చతుర్వేదీలు తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వారు చెప్పారు. దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణంలో జాతీయ అధ్యక్షుడు అంకుర్‌శర్మ ప్రధాన భూమిక పోషిస్తున్నారని భారత ఎన్నికల సంఘం కూడా తమ పార్టీని అధికారికంగా గుర్తించినట్లు వారు తెలిపారు. ఆదివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని జగదీశ్ మందిర్‌లో ఏకం సనాతన్ భారత్ దళ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపారు. వారు రాబోయే పార్లమెంటు ఎన్నికల నాటికి రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసి ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు వారు వివరించారు. పార్టీ ఉపాధ్యక్షుడు నందకిషోర్ అగర్వాల్, మీడియా ఇన్‌చార్జి వినయ్ శర్మ, నాయకులు రామాంజన్, భగత్‌సింగ్, దినేష్, గీతేష్‌కాటే తదితరులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగులకు న్యాయం



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగస్తులకు భరోసా లేదని అందువల్ల పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తేనే ఉద్యోగస్తులకు భద్రతతోపాటు తగు న్యాయం జరుగుతుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఏపీ, తెలంగాణ యూనిట్ అధ్యక్షుడు వి.నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... ఉద్యోగస్తులకు సాంఘిక భద్రత లేనటువంటి నూతన పెన్షన్ విధానం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 1982లో సుప్రీం కోర్టు పెన్షన్ అనేది ఉద్యోగస్తులకు భిక్ష కాదని అది వారి ప్రాథమిక హక్కు అని చెప్పిందని గుర్తు చేశారు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నూతన పెన్షన్ విధానం తీసుకువచ్చిందన్నారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షులు సి.హెచ్.వి. రామారావు, జనరల్ సెక్రటరీ మండెల్ల వీరభద్రారావు, డాక్టర్ ప్రణయ్‌శాస్త్రీ, అసోసియేషన్ నాయకులు వి.జైయబాల్, ఎస్.సోమనాథన్, గోలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి



వీరభద్రస్వామి కళ్యాణోత్సవానికి భక్తులను ఆహ్వానిస్తున్న వినోద్ తదితరులు

కాచిగూడ: మన సంస్కృతి, సంప్రదాయాలను, భారతీయ వారసత్వ సంపదను భావి తరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఉందని శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ అన్నారు. ఆదివారం నింబోలి అడ్డాలో జరిగిన కార్యక్రమంలో శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు కర్మన్‌ఘాట్ ఏపీఆర్ గార్డెన్స్‌లో జరగనున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను భక్తులకు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కురవికి వెళ్లి వీరభద్రస్వామి కల్యాణాన్ని చూడలేక పోయిన భక్తులు ఈ కల్యాణ వేడుకల్లో పాల్గొనడానికి మంచి అవకాశం అని అన్నారు. కార్యక్రమంలో అద్దోజు చక్రపాణి, అద్దోజు ప్రకాష్, మధుసూదన్ చారి, మాధవ్ చారి, టి. భాస్కర్ రాజ్ గౌడ్, ఆర్.రాజేష్ కుమార్, బి.ఉపేందర్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్కూల్ రైఫిల్ షూటింగ్‌లో కీర్తనకు స్వర్ణం



కాచిగూడ: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ విభాగంలో పీజీ స్కూల్‌కి చెందిన ఎం.కీర్తన స్వర్ణ పతాకాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ స్కూల్ ఫెడరేషన్, మేడ్చల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ రైఫిల్ షూటింగ్ రేంజ్‌లో జరిగాయి. ఆదివారం ముగిసిన పది మీటర్ల హెయిర్ రైఫిల్ షూటింగ్ విభాగంలో కీర్తన 197/200 పాయింట్లు సాధించి అత్యంత ప్రతిభ కనపర్చిన స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మధ్యప్రదేశ్ లోని భూపాల్‌లో ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా స్కూల్ గేమ్స్ పోర్టులో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఆమె ఎంపికయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ యూత్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి భారత యూత్ జట్టు సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు కీర్తన సాధించడం విశేషం. తాను జాతీయ స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తాని కీర్తన తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల కీర్తన జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ఆమె తల్లి వై.ఎస్.స్వర్ణలత ప్రస్తుతం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

ఘనంగా జాతీయ పింఛన్‌దారుల దినోత్సవం



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నళినీమోహన్, బుచ్చిరాజు తదితరులు

చిక్కడపల్లి: జాతీయ పింఛన్‌దారుల దినోత్సవాన్నివ కార్యక్రమం ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలితకళావేదికలో అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగింది. సంఘం అధ్యక్షులు నళినీమోహన్, ప్రధాన కార్యదర్శి బుచ్చిరాజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేట్ ప్రసిడెంట్ వి.వి.జనార్ధనరావు, సలహాదారులు కె.ఎస్.ఆర్.ఆంజనేయులు, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్రనాథ్, పి.నారాయణరెడ్డి, ఎం,సుబ్రహ్మణ్యశర్మ, రఘునాథ్, కె.విశ్వేశ్వర్‌రావు, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సంఘంలో 80 సంవత్సరాలు దాటిన పెన్షన్‌దారులను సత్కరించి అభినందించారు. ఈ సభలో 2024వ సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. తొలుత పెన్షన్ కోసం పోరాడిన డి.ఎస్.నకార చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలు అర్పించారు. పింఛన్ దారులు వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను వక్తలు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

అలరించిన నిర్విరామ సినీ సంగీత విభావరి



సన్మాన గ్రహీతలతో రామ్కీ, విజయదర్గ, సాయిరాణి, యోగితా ప్రభంజన్ అక్కిరాజు

చిక్కడపల్లి: రిషి మ్యూజికల్ ఈవెంట్స్ ద్వితీయ వార్షికోత్సవాన్ని సందర్భంగా చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలో 52 మంది గాయనీగాయకులతో 12 గంటలపాటు నిర్విరామ సినీ సంగీత విభావరి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు యోగితా ప్రభంజన్ అక్కిరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు, ప్రొడ్యూసర్ రామ్కీ, దూరదర్శన్ విశ్రాంత అధికారి విజయదర్గ, ప్రొఫెసర్ పి.సాయిరాణి పాల్గొని జ్యోతి ప్రజలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ గాయకులు అనురాధ పాల్వంచ, వింజమూరి రేవతి, శ్రీదేవి రేణుకారమేష్, సుజాత పెద్దిడ్ల, ప్రజ్ఞలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రిషి మ్యూజికల్ అకాడమీ విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ గాయనీ గాయకులను ప్రోత్సహించి వారిని సన్మానించడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రముఖ గాయకులు త్రినాథరావు, మధుబాబు, కె.ఇ.రాజు, ఉదయభాస్కర్, రవిబాబు, వెంకటేశ్వర్‌రావు, శ్రీరామ చంద్రశేఖర్, ప్రాగ్నిక ప్రవీణ్, కళ్యాణ వీణ కళ్యాణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు అక్కిరాజు ప్రభంజన్ పాల్గొన్నారు.

సందడిగా 'క్రిస్మస్ కార్నివాల్'

- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు
- పలు ప్రాంతాల్లో శాంతి ర్యాలీ నిర్వహణ
- శాంతాక్లాజ్ వేషధారణల్లో సందడి చేసిన క్రైస్తవులు



ర్యాలీని ప్రారంభించిన చర్చి కోశాధికారి డాక్టర్ విమల్ సుకుమార్, డాక్టర్ దీన్‌దయాల్

ముషీరాబాద్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సీఎస్ఐ వెస్లీ చర్చి ముషీరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం క్రిస్మస్ కార్నివాల్–2023 శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముషీరాబాద్ వెస్లీ చర్చి నుంచి ప్రారంభమై గోల్కొండ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్ రోడ్, వీఎస్‌టీ చౌరస్తా, రాంనగర్, దయారా మార్కెట్ మీదుగా ముషీరాబాద్ వరకు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఎస్ఐ చర్చి కోశాధికారి డాక్టర్ బి.మిల్ సుకుమార్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. బైబిల్‌లోని దైవ సందేశాన్ని వినిపించారు. ర్యాలీలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొని ఏసు క్రీస్తు భక్తి గీతాలు పాడుతూ, శాంతాక్లాజ్ వేషధారణలో ముస్తాబై ర్యాలీలో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగారు. ప్రధాన కూడళ్లలో బైబిల్‌లోని దైవ సందేశాన్ని భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో సీఎస్ఐ పాస్టరేట్ సెక్రటరీలు బి.జె.దీనదయాల్, డాక్టర్ ఎం.స్టీఫెన్స్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శాంతాక్లాజ్ వేషధారణల్లో...

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సన్మానం



ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న అఫ్జల్ షరీఫ్ నవాబ్

ముషీరాబాద్: శాసన సభ ఎన్నికలలో ముషీరాబాద్ నుంచి అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు సహకరించిన అఫ్జల్ షరీఫ్ నవాబ్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్‌కు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్యామ్‌సుందర్ చిట్టి, సయ్యద్ అస్లాం, ఆంజాద్ పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు అభినందన

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ఆటవీ శాఖ మంత్రిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన కొండా సురేఖను మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వి మహేందర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి బండి కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి అభినందనలు తెలియజేశారు.

రైతు బంధులో దోపిడీపై విచారణ జరిపించాలి

బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రైతు బంధు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వం సొమ్ము కాజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల నుంచి వందల కోట్ల రూపాయలను రికవరీ చేయాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో రైతు బంధు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతు బంధు ముసుగులో రైతు బంధు పేరుతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసిన అందరిపై ఆర్థిక నేరాలకు పాల్పడిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. కాజేసిన సొమ్మును వసూలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.

19న ప్రేమ రామూర్తికి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం



చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, లత ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కర్నాటక వొకలిస్ట్ విదూషి ప్రేమ రామ్మూర్తికి మంగళవారం సాయంత్రం రవీంద్రభారతిలో లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేయనున్నట్లు ఫౌండేషన్ ట్రస్టీ తెలిపారు. ముఖ్య అతిథిగా తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు, పద్మశ్రీ డాక్టర్ ఆనంద్‌శంకర్ జయంత్, వెంకట్ గరికపాటి పాల్గొంటారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: మానవ తప్పిదాలతో సమాజం ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చిందని, భావి తరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ విధిగా పర్యావరణ భావజాలాన్ని... పరిరక్షించుకోవాలనే అవగాహనను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం బర్కత్‌పురాలోని తన నివాసంలో పర్యావరణ పరిరక్షణ ఉద్యమ సంస్థ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్' మాసపత్రికను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. పర్యావరణ భావజాలంతో ఒక ప్రత్యేక పత్రికను తీసుకురావడం అభినందనీయమని, ఈ సందర్భంగా ఎన్విరాన్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్యను కేంద్ర మంత్రి అభినందించారు. కార్యక్రమంలో సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప స్వామి పల్లకీ సేవలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు



పూజలో పాల్గొన్న భక్తులు

కాచిగూడ: ధన్నోహం ఓ శబరీషా.. నీ శుభరూపం నేటికి చూశా.. అంటూ అయ్యప్ప స్వామి శరణు ఘోషతో ఆదివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కాలేజ్ ప్రాంగణం భక్తి పారవశ్యంతో పులకించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన మండపంలో గణేష్, సుబ్రమణ్యం, అయ్యప్పలను పెట్టి ఘనంగా పూజలు జరిపారు. ఆకర్షించే విగ్రహాలను పెట్టి పడిపూజ నిర్వహించగా, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాలుపంచుకున్నారు. అనంతరం స్వాములకు భిక్ష, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేతలు డాక్టర్ కె.లక్ష్మణ్, మురళీధర్‌రావు, డి.కె.అరుణ, కె.గీతామూర్తి, చింతల రాంచంద్రారెడ్డి, జస్టిస్ నర్సింహారెడ్డి, డాక్టర్ ఎన్.గౌతం రావు, పరిణీత శేఖర్, ప కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఎక్కాల నందు, లక్ష్మపురి సత్యనారాయణ, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఏ నూతన కార్యవర్గం



ఎన్‌సీఏ నూతన కార్యవర్గ సభ్యులు

నల్లకుంట: సీనియర్ సిటిజన్‌ల సమస్యల పరిష్కారం కోసం అంతా కలిసి కట్టుగా ముందుకు రావాలని ఎలక్షన్ కమిషన్ విశ్రాంత అధికారి, నల్లకుంట సీనియర్ ఇటిజన్స్ అసోసియేషన్ (ఎన్‌సీఏ) సలహాదారు రమేష్ నాయుడు పిలుపు నిచ్చారు. ఆదివారం నల్లకుంట క్షత్రియ టవర్స్‌లో ఎన్‌సీఏ సమావేశంలో ఎన్‌సీఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్‌సీఏ అధ్యక్షుడిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ వి.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మోహన్ నాయుడు, కోశాధికారిగా శ్రీనివాస్ రావు, నిర్వహణాధికారిగా వీరయ్య, సలహాదారులుగా విశ్రాంత చీఫ్ ఇంజనీర్ రమేష్‌నాయుడు, సువాస్, నందకుమార్, కిషన్ రావు, సాంబయ్య, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, అశ్విన్, హర వెంకటస్వామి, సురేష్, రవి కుమార్, సత్యనారాయణ, కిరణ్, సునీల్, సహాయ కార్యదర్శులుగా శివకుమార్, గోపాల్, సోమశేఖర్, సునీల్, 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌సీఏ అధ్యక్షుడు మోహన్ రావు మాట్లాడతూ.. అసోసియేషన్‌ను విధివిధానాలను వివరించడంతో పాటు, సమస్యల సరిష్కారానికి పలు సూచనలు చేశారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

కాచిగూడ: రాబోయే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయని, అదంతా ఆ పార్టీల రాజకీయ నాటకమని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపైన చర్చించకుండా ఆధిపత్య రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. పార్లమెంట్‌లో బలమైన గళం వినిపించడానికి డాక్టర్ అంబేద్కర్ వాదులు పార్లమెంట్‌లో ప్రవేశిస్తేనే దళిత బహుజన జాతులకు సోషల్ జస్టిస్ జరుగుతుందన్నారు. తెలంగాణలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాలకు బలమైన ఎంపీ అభ్యర్థుల జాబితా సిద్ధం చేయాలని అన్నారు. పార్టీ నేతలు సి.యాదగిరి, వేదవృత్, బీరం సతీష్ కుమార్, దేవునూరి శ్రీనివాస్, దాసరి భాస్కర్, వరదా జ్యోతి, కొత్తపల్లి రాజేశ్వర్, శివసాయి తేజ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు అభినందన




సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి ఎంఐజీ–2 పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ముఠా గోపాల్‌ను కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.రత్నాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జి.శేషయ్య, ట్రెజరర్ ఎం.జె.జోషఫ్, సభ్యులు రమణరావు, రామచందర్, జి.ఎన్.చారి, నాగేశ్వర్‌రావు, రవీంద్రమోహన్, రామకృష్ణా, రమేష్, నారప్ప, ప్రసాద్, అనిల్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల భక్తి గీతాలు

నల్లకుంట: నల్లకుంటలోని శ్రీ సాయిశృతి మ్యూజిక్ అకాడమీ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అకాడమీ విద్యార్థులు కీ బోర్డు, శాస్త్రీయ సంగీతం, భక్తి సంగీతంతో పాటు కీర్తనల పునచ్చరణ తరగతిలో ఉత్సాహంగా గడిపారు. ఆదివారం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలోని రెండో అంతస్థులో నిర్వహించిన రిహార్సల్స్‌లో ప్రముఖ మ్యూజిక్ థెరపిస్ట్, కీబోర్డు కళాకారిణి యామిని, ప్రముఖ సంగీత విద్వాంసురాలు యామినిల పర్యవేక్షణలో చిన్నారులు భక్తి గీతాలు, కీర్తనలు ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణా మూర్తి, మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా మాతా కుసుమకుమారి జయంతి



భజన చేస్తున్న భక్తులు

నల్లకుంట: నల్లకుంట ప్రశాంత్‌నగర్‌లోని కుసుమహరనాథ ఆశ్రమంలో ఆదివారం మాతా కుసుమ కుమారి జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమహరనాథుల మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, పూల మాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అర్ధ ఏకాహం, భక్తులచే నిర్వహించిన భజన విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

జర్నలిస్టు సంక్షేమ సంఘం గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా సంతోష్



కాచిగూడ: తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా సంతోష్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ ఆదివారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో సంతోష్ మాట్లాడుతూ... ప్రశ్నించే జర్నలిస్టులను అణిచివేయాలని గత ప్రభుత్వం ఎంతోమంది జర్నలిస్టులపై కేసులు నమోదు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులు లేకపోతే ప్రజా సమస్యలు ప్రభుత్వానికి ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అలాంటి జర్నలిస్టులను కొంతమంది రాజకీయ నాయకులు తమపై వార్తలు రాస్తున్నారనే దురాలోచనతో తప్పుడు కేసులు పెట్టి వారికి అనుకూలంగా ఉండేటట్టు చేసుకుంటున్నారని అన్నారు. పరిస్థితిని గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గత ప్రభుత్వం జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి కె.రామాంజనేయులు, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్ పర్యవేక్షించారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు పహల్‌పత్తు ఉత్సవాల సందర్భంగా సాయంత్రం 6 గంటలకు దేవాలయ ద్వార బంధనం, 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నట్లు వివరించారు. 23 నుంచి 27వ తేదీ వరకు రావత్తు ఉత్సవాలు, 27వ తేదీన నమ్మాళ్వార్ పరమ మహోత్సవం, జనవరి 1న కుడరై ఉత్సవాలు, 14న గోదాసమేత రంగనాథ స్వామి వారి కల్యాణం, 15వ తేదీన మకర సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

బోర్‌వెల్స్‌కు మరమ్మతులు చేపట్టండి



కాచిగూడలో బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

కాచిగూడ: కాచిగూడ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో చెడిపోయిన హ్యాండ్ బోర్స్, పవర్ బోర్‌వెల్స్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టిన ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జలమండలి అధికారులను కోరారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మోతీమార్కెట్, చెప్పల్‌బజార్, లింగంపల్లి, బాలప్పబాడ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించి పాడైన బోర్‌వెల్స్‌ను పరిశీలించారు. నేతలు సుభాష్ పటేల్, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, బాలప్రసాద్, సూరి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



నల్లకుంట: ప్రముఖ సంఘ సేవకులు వీరేశంగుప్తా, ముత్యాల విజయ్‌ల సంయుక్తాధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్ ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. అంబర్‌పేట శాసన సభ్యుడు కాలేరు వెంకటేష్ నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు ప్రతిభ, బత్తుల రవి, జనార్ధన్, యూసఫ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383